

# అమెరి "కలగూరగంప" కామెడి
## వంగూరి చిట్టెన్‌రాజు



## "సంధి ప్రేలాపన" కథ

5

**నాకెందుకో** చిన్నప్పటినుంచీ కూడా ఏ పని చేసినా "దర్జాగా" చెయ్యాలి అని ఉండేది. ఇప్పుడు కూడా అదే ప్రయత్నం చేస్తూ ఉంటాను. ఉదాహరణకి, కిందటి నెల నాకు జరిగిన సర్జరీని మామూలుగా 'బైపాస్ సర్జరీ చేయించుకున్నాను' అన్నాను అనుకోండి. ఏదో చప్పగా, ఏదో చిన్న డాక్టరు ఒకడు సరదాగా చిన్న కత్తెర వేసినట్టు ఉంటుంది. అదే "ట్రిపుల్ బైపాస్" అనో "కార్డియో వేస్క్యులర్ కరెక్షనల్ ప్రొసీజర్" అనో అన్నామనుకోండి. అది వినగానే "ఒరి నాయనోయ్" అని ఠపీమని లేచి నుంచుంటాం కదా! అదన్నమాట. అందుకే అన్నారు కొడితే ఏనుగు కుంభ స్థలాన్నే కొట్టాలని. పైగా అమెరికాలో ఏ హాస్పిటల్‌లో అలాంటివి జరిగినా "ఇది ప్రపంచంలో అన్నింటి కన్నా గొప్ప ఆసుపత్రి ఓచ్" అని గొప్పలు చెప్పుకుంటాం. అంటే, మా పెద్దాపురం పెద్దాసుపత్రికి వెళ్ళిన వాళ్ళు, "ఇదండీ, పిటాపురం ఆసుపత్రి కంటే శానా పెద్దదండి, ఆయ్య" అని చెప్పుకుంటారు. కాకినాడ పెద్దాసుపత్రి వాళ్ళు "మాది పెద్దాపురం అనుకుంటున్నారేటి? మా లెవలే వేరు" అని భుజాలు ఎగరేస్తారు. ఆ రూలు ప్రకారం నాకు సర్జరీ జరిగిన మైకెల్. డి బేకీ హార్ట్ సెంటర్ ప్రపంచంలోనే ప్రసిధ్ధిగాంచిన ఆసుపత్రి అనమాట. అదెంత గొప్ప హాస్పిటల్ అంటే, అందులో ఖాళీ లేక ఎన్.టీ.ఆరూ, పీ.వీ. నరసింహా రావు గారూ పక్కనే ఉన్న పిటాపురం ఆసుపత్రిలో వాళ్ళ ఆపరేషన్ చేయించుకున్నారు అప్పుడెప్పుడో.

నా విషయంలో మరొక గొప్ప సంగతి ఏమిటంటే, ఆఫ్టాల్ మామూలు బైపాసులయితే, ఆపరేషన్ అవగానే మూడు, నాలుగు రోజులు చూసి, తరవాత ఒక పక్కన డాక్టర్లు గోలపెడుతున్నా వినకుండా, నలభై మందులూ, ముప్ఫై కాగితాలూ, ఒక లక్ష డాలర్ల బిల్లూ మన చేతిలో పెట్టేసి ఇచ్చేసి ఇంటికి తోలేస్తుంది ఇన్సూరెన్స్ వ్యవహారాలు చూసే ఒక ప ద్దెనిమిదేళ్ళ అమ్మాయి. అదే నా కేసులో, మూడు వారాల పాటు దగ్గర ఉంచుకుని డాక్టర్లూ, అంత కంటే ఎక్కువగా పసుపు మరియు నల్ల నర్సులు నన్ను అంచెలంచెలుగా ప్రేమగా చూసుకుని, నేను ఇంటికి వచ్చేస్తుంటే తెగ బాధ పడిపోయారు. ఒక పిల్లి కళ్ళ సుందరి అయితే "అప్పుడే వెళ్ళిపోతున్నావా, మళ్ళీ ఎప్పుడు వస్తావో ఏమిటో" అని కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంది, "నోర్ముయ్, వెధవ మాటలూ, నువ్వూను. బుధ్ధి లేక పోతే సరి, ఇప్పటికే తడిపి మోపెడు అయింది" అని మా క్వీన్ విక్టోరియా ఆ పిల్లని నడ్డి మీద చంపేసింది, చేతిలో ఉన్న బిల్లు చూసి గడగడ లాడుతూ. అది గమనించి "ఎంతయిందీ?" అని అడిగాను బుధ్ధిలేక. "ఇప్పుడే బతికి బైట పడ్డావు. ఈ బిల్లు చూశావంటే, ఈ సారి గేరంటీ....నాకే

హార్ట్ ఎటాక్ వచ్చేలా ఉంది" అని రెచ్చి పోయింది క్వీన్ విక్టోరియా. నమ్మండి, నమ్మకపోండి. ఆ బిల్లు ఖచ్చితంగా ఆంధ్రప్రదేశ్ రైతులకి ప్రభుత్వం ఇవ్వలేని రాయితీ స్థాయిలో ఉండి ఉంటుంది.

నా మూడు వారాల ఆసుపత్రి ప్రహసనంలో ప్రధానాధ్యాయం కేవలం మూడు రోజులే! ఎందుకంటే ఆ మూడు రోజులూ నేను "సంధి" డిపార్ట్‌మెంట్‌లో ఉన్నాను అందరికీ తెలిసే ఉంటుంది, ఇండియాలో కొంత మంది పాపం ప్రాణం మీదకి వచ్చినప్పుడు, అపస్మారకం స్థితిలో ఉండి, వాళ్ళేం మాట్లాడుతున్నారో వాళ్ళకే తెలియని ఈ నాటి తెలుగు సినిమా డైలాగులలాంటివి గంటల తరబడి చెపుతూ ఉంటారనీ, దాన్ని "సంధి ప్రేలాపన" అంటారనీ చెప్పేవారు పెద్దలూ, పురోహితులూనూ. ఏ కారణం వలనో నా మెదడుకి ఆక్సిజన్నో, రక్తం పంపిణీయో అనుకోకుండా తగ్గిపోయి, చావు తెలివి విజృంభించిందని ఇక్కడ డాక్టర్లు నిర్ధారించారు. అసలు ఫుల్ లెవెల్‌లో ఆక్సిజన్ ఉంటేనే నా అప్రస్తుత ప్రసంగాలని ఆపలేరు కదా! అలాంటిది సెవెంటీ ఫిఫ్టీ పెర్సెంట్ ఆఫ్‌లో ఉంటే ఇంక నా అసందర్భ ప్రేలాపనకి అడ్డేమిటీ? అందుకే నన్ను ఈ ఆసక్తికరమైన సంధి డిపార్ట్‌మెంట్‌లో పెట్టారు. దాన్ని డెలీరియం వింగ్ అంటారేమో! నా స్వీయ ప్రేలాపనకి ముచ్చట పడి, ఆ గదిలో ఉన్న మిగిలిన పేషెంట్స్‌కి కూడా ఇదేదో బావుందే అని సరదా వేసి, వాళ్ళు కూడా వాగుడు మొదలు పెడితే, మైకెల్ డిబేకీ సెంటర్ అంతా వైజాగ్ పిచ్చాసుపత్రి స్థాయికి వస్తుందేమో అని భయపడి నాకు ఈ వింగ్‌లో గది కేటాయించారేమో అని నా అనుమానం. అందు వలన మిగిలిన పేషెంట్స్ ఎంత ఆనందాన్ని పోగొట్టుకున్నారో పాపం!.

ఈ డెలీరియం అనేది స్వర్గానికి తొలిమెట్టు అని మన నమ్మకం కాబట్టి, ఎలాగా అవకాశం వచ్చింది కదా అని నేను ఎంత ప్రయత్నించినా, ఎక్కడా రంభా, ఊర్వశీ, తిలోత్తమలు కనపడక చాలా విచారించాను. మన పవిత్ర హిందూ స్వర్గంలో కూడా పసుపూ, నలుపూ, ఒకటో, అరో శుద్ధ తెలుపు సుందరీమణులే తారట్లాడడం అంతకంటే అన్యాయం. ఏదేదో వైద్యం చేసి, నా నోరు కట్టేసినా, ఆ మూడు రోజుల సంధిలోనూ ఇలాంటి అమెరికలగూర గంప కథలూ, కబుర్లూ చాలానే చెప్పాను. అవన్నీ నాకు ఇంకా గుర్తే! ఉదాహరణకి ఆ సమయంలో ఒక డాక్టరు బాబు నా పరిస్థితి సమీక్షిస్తూ, "ఉండదల్చుకున్నావా? పోదల్చుకున్నావా?" అని అడిగిన గుర్తు. దానికి సమాధానంగా నేను "ఇక ఈ అవతారం విసుగొస్తోందీ, పోడానికి పెద్ద అభ్యంతరం లేదు కానీ నీకు దారి తెలుసునా?" అన్నాను. అప్పుడు ఆ మానవుడు పెట్టిన వెర్రి మొహం నాకు ఇప్పుడు కూడా గుర్తే!.

ఈ స్పెషల్ గదీ, ఏర్పాట్లు బాగానే ఉన్నాయి కానీ, నా పరపతికి పెద్ద డేమేజీ జరిగిపోయిందేమో అని నా అనుమానం. ఎందుకంటే, నేను నాలో నేను సరదాగా మాట్లాడుకుంటూ, నెప్పులు...అంటే ఆ నొప్పులు కాదు....ఒంటి మీద పెట్టిన కత్తి గాట్లు, సూది పోట్ల వలన నాకు వచ్చిన నొప్పులనమాట......ఎక్కువయినప్పుడల్లా హాయిగా అందరికీ, ముఖ్యంగా నర్సుకి వినపడేలా "బాబోయ్ మందు బాబోయ్" అని అరిచేవాణ్ణి. అపస్మారకంలో ఉన్నప్పుడు కూడా నా నోటమ్మట తెలుగే వస్తుంది కానీ అంగ్రేజీ రాదు కదా! ఆ అరుపులు విని, అప్పుడే నన్ను చూడ్డానికి వచ్చిన ఒక తెలుగు మిత్రుడు నాకేం కావాలో తెలియక మొహం వేళాడేస్తున్న నర్సు దగ్గరకి వెళ్ళి రహస్యంగా "మా వాడు మేలి రకం స్కాచ్ తప్ప, వోడ్కా లాంటి చిల్లర సరుకు ముట్టుకోడు, ఆ మందే ఇవ్వండి, కావాలంటే నేను ఒక ఫుల్ ప్రెజెంట్ చేస్తాను" అని రికమెండ్ చేశాడు. ఆ సలహా విని, అంత దూరం నుంచి వచ్చిన అతన్ని వాళ్ళు "విజిటర్స్ టైం అయిపోయింది" అని రెండు నిముషాల్లో పంపించేశారు. తెలుగు వాళ్ళ మీద ఉన్న మందు ప్రభావం తెల్ల వాళ్ళకేం తెలుసూ!

నేను సంధి డిపార్ట్‌మెంట్‌లో ఉన్నప్పుడే మరొక మిత్రుడు నన్ను చూడ్డానికి వచ్చాడు. రాగానే నా చెయ్యి పట్టుకుని ఆప్యాయంగా నిమిరాడు. నాకేం తెలుసూ? నా లోకం వేరే కదా! అంచేత ఆ వచ్చినదెవరో గుర్తుపట్టకపోయినా, నేను కూడా అంతకంటే ఆప్యాయంగా ఆ చేతిని గట్టిగా పట్టుకున్నాను. అతని చేతి చుట్టూ నా చెయ్యి బిగుసుకుపోతూ ఉండడంతో ఆ మానవుడు బిక్క చచ్చిపోయి, కష్టపడి విడుల్చుకుని, నర్సుని నాలుగు తిట్టి, మళ్ళీ ఇప్పటిదాకా కనపడ లేదు. ఆయనెవరో నాకు తెలిస్తే నన్ను చూడ్డానికి వచ్చినందుకు మంచి షేక్ హేండ్ ఇవ్వాలని నాకు కోరికగా ఉంది. మనం ఎప్పుడైనా హాస్పిటల్ ఉన్న వాళ్ళని పరామర్శించడానికి వెళ్ళినప్పుడు నమస్కార

బాణం వెయ్యడమో, లేదా రోబో సినిమాలో షోగ్గా చెయ్యి ఊపుతూ హాయ్ అంటున్న ఐశ్వర్యారాయ్‌లాగో తగు మాత్రం దూరం నుంచే పలకరించాలి కానీ, పేషేంటు కాళ్ళూ, చేతులూ పట్టుకుని వేళ్ళాడుట మంచిది కాదూ అనేది ఇందులో నీతి.

నేను హాస్పిటల్లో ఉన్నప్పుడు "పాపం వాడికి ట్రిపుల్ బైపాస్‌ట" అని ముప్ఫై ఏళ్ళనాటి మిత్రులూ, వాళ్ళ సంఘ సేవకి నన్ను వాడుకునే మిత్రులూ, నా గొప్పలు చెప్పుకోడానికి నేను వాడుకునే యువతీ యువకులూ "వీణ్ణి చూడ్డానికి ఇదే మంచి సమయం, మామూలుగా అయితే వాడి సుత్తి భరించలేం" అనుకుని చాలామంది నన్ను చూడ్డానికి వచ్చారు. అంతవరకూ "నూట ఒక్క జిల్లాలకి అందగాడు"గా నన్ను చూసిన వాళ్ళందరికీ ఆ పరిస్థితిలో నన్ను చూడగానే ఖచ్చితంగా సాక్షాత్తూ విష్ణుమూర్తుల వారిని చూస్తున్న ఫీలింగ్ వచ్చి ఉండాలి. ఎందుకంటే సదరు విష్ణుమూర్తులవారు నాలుగైదు చేతులతో శంఖం మొదలైన నిత్యావసర వస్తువులు పట్టుకుని, బొడ్డు నుంచి వచ్చిన ప్లాస్టిక్ ట్యూబు అంచున బ్రహ్మదేవుడూ వగైరా హంగులతో ఆయన శరీరం అంతా బిజీగా ఉంటుంది కదా! పైగా విజిటర్స్‌గా వచ్చి మొరలు పెట్టుకునే మునీశ్వరులతో మాట్లాడేటప్పుడో, ఒకే పొజిషన్ బోరుకొట్టి మరో పక్కకి తిరిగి శయనిద్దామనుకున్నప్పుడో శ్రీ మహా విష్ణువు ఆదిశేషుణ్ణి ఎక్కడో కొంచెం గోకి, లేదా గిల్లి తను పవ్వళించే పొజిషన్ మార్చుకుంటాడు కదా. అలాగే నేను కూడా, ఆదిశేషుడి తలలలాగా అనేక బటన్స్‌తో నా స్పెషల్ మంచంలో ఎక్కడ ఏ బటన్ నొక్కితే అది బుసలు కొడుతూ నా తలకాయో, కాళ్ళో గాలిలోకి తేలిపోతాయో అని పరిశోధిస్తూ, ఒంటి నిండా తామర తూడుల లాంటి రంగురంగుల ప్లాస్టిక్ ట్యూబులూ, వాటి అంచున శంఖ, చక్ర గదలలాంటి సెలైన్ బాటిల్స్ వగైరాలూ, సినిమాలో ఎన్.టి.ఆర్ వేసుకున్న పంచెలాంటి హాస్పిటల్ గౌనూ వగైరాలతో నేను పెర్సనల్‌గా ఫీలవుతున్న విష్ణుమూర్తుల టైపు ఫీలింగే నన్ను చూడ్డానికి వచ్చిన మిత్రులకి కూడా వచ్చి ఉంటుంది అని నా సిద్ధాంతం. టివి నైన్ వారు కూడా నన్ను పరామర్శించడానికి హాస్పిటల్ కి వచ్చారు కానీ, నన్ను ఆ గెటప్‌లో చూడగానే కెమేరా దాచేసుకున్నారు.

మూడో వారంలో నన్ను పరామర్శించడానికి వచ్చిన మరొక మిత్రుడు "ఏం పరవా లేదు గురూ, అక్కినేనిని చూడు. ఆపరేషన్ అయి పదేళ్ళు దాటినా హాయిగా ఉన్నాడు. అలాగే, సుబ్బారావూ, చౌదరీ, రాఘవ రెడ్డీ అందరూ డూయింగ్ వెల్. నేను కనీసం పాతిక కేసులు ఇలాంటివి చూశాను. అందరూ మూడు నాలుగు రోజులలో ఇంటికి వెళ్ళి కోలుకున్న వాళ్ళే. నువ్వేమో మూడు వారాల నుంచీ ఇంకా ఇక్కడే ఉన్నావు. నా లైఫ్‌లో నేను చూసిన వాటిల్లో నీదే వరస్ట్ కేసు" అని తనకి తెలిసిన వరస్ట్ కేసుల మీద అరగంట క్లాసు పీకాడు. ఆ సమయంలో నాకు వరస్ట్ కేసు వివరాలు చెప్పడం అంత అవసరమా చెప్పండి.

ఇక్కడ మా హాస్పిటల్ సిబ్బంది పని తీరు గురించి ఒక మాట చెప్పాలి. నర్సు మందులు ఇవ్వడం, వాళ్ళు వండే వాటిల్లో ఏ గడ్డి తింటానో అడగడానికి వంటావిడా, ఒకానొక రక్త పిపాసి రెండు పూటలా వచ్చి గేలన్లకొద్దీ నా రక్తం లాగేసి పట్టుకుపోవడం, అప్పుడప్పుడు ఒళ్ళంతా తడిగుడ్డతో తనివితీరా తుడిచేసి నాకు మంగళ స్నానాలు చేయించే మంగమ్మా, ...ఇలా అనేకమంది ఈ ఐసీయూలో పొద్దుటినుంచీ ఎవరి పని వారు చేసుకుంటూ పోతారు. ఇలా నా గదిలోకి వచ్చిన ప్రతీ వారూ "నీ పేరు ఏమిటీ?", "నీ పుట్టిన రోజు ఎప్పుడూ? - "ఇప్పుడెక్కడున్నావో తెలుసా?" లాంటి ప్రశ్నలు యధాలాపంగా అడిగేసి, నా చేతికి కట్టిన కడియం మీద కూడా అదే ఇన్ఫర్మేషన్ ఉందా, లేదా అని చెక్ చేసేవారు. అంటే, పెద్దాపురం ఆసుపత్రిలో పిల్లలు, తల్లిదండ్రులూ తారుమారు అయినట్టు ఒక పేషేంట్ రోగానికి మరొకడి మందులు ఇచ్చెయ్యకుండా ముందు జాగ్రత్త అన్నమాట. వాళ్ళేదో సరదాకి అడుగుతున్నారని అనుకుని, అవే ప్రశ్నలకి రోజుకి పది సార్లు అవే సమాధానాలు చెప్పడానికి విసుగేసి, ఒకసారి వెరైటీ కోసం నా పుట్టిన రోజు బదులు మా క్వీన్ విక్టోరియా పుట్టిన రోజు చెప్పాను. అంతే! ఆ రక్త పిపాసి నాకేసీ, నా పేపర్ కడియం కేసీ ఒకసారి చూసి, అర్జంటుగా పెద్ద నర్సు దగ్గరకి పరిగెట్టింది. గోదావరి సినిమాలో కమలిని ముఖర్జీలాగా ఆ పిల్ల పరిగెట్టడం లాంగ్ షాట్‌లో వెనకాల నుంచి చూడ్డానికి కనుల పండుగలా ఉన్నా, అప్పుడే నా రక్తనాళాలలోకి సగం గుచ్చిన దబ్బనం ..అంటే ధాన్యం బస్తాలు కుట్టే పెద్ద సూదిని అలాగే వదిలేసి

పారిపోవడం, ఆ అవకాశాన్ని వాడుకుని ఆ వెధవ సూదిని మనమే పీకేసుకోవాలో, లేక అందంగా బైటకి పరిగెట్టిన రక్త పిశాచి మళ్ళీ వచ్చి తనే పీకుతుందో తెలీక భలే చికాకు వేసింది. ఆ తరవాత పెద్ద నర్సు వచ్చి మా క్వీన్ విక్టోరియా తోటి ప్రేమగా మాట్లాడి, నాకు ఆవిడ చేత సరదా అబద్ధాలు అడడంలో ఉన్న అనర్థాల మీద ప్రైవేటు చెప్పించి దబ్బనం పీకించింది. ఎందుకో తెలియదు కానీ ఈ సారి మూడు గేలన్ల రక్తం లాగేసింది ఆ రక్తపిపాసి.

గమనించ వలసిన మరొక విషయం ఏమిటంటే ఈ మూడు వారాలలోనూ మా సర్జనూ, ఇతర డాక్టర్లూ కేవలం మూడు సార్లే నా గదికి వచ్చారు. అమెరికాలో డాక్టర్లు, పేషెంట్లూ కలిసి కనపడే టైము పదిహేను నిమిషాలు దాటదు. అది అమెరికా పద్ధతి. ఎందుకంటే, అసలు సిసలు డాక్టర్లే మన దగ్గరకి వస్తే, మనం అడిగే ప్రశ్నలకి వాళ్ళ దగ్గర సమాధానాలు ఉండవు. ఇక క్వీన్ విక్టోరియా తగులుకుందంటే, అంతే సంగతులు. ట్రిపుల్ బైపాస్ చేసిన మా సర్జన్ మొహంలో కూడా కత్తివేటుకి నెత్తురు చుక్కరాలదు..

మొత్తానికి ఏమైతేనేం, ఈ అమెరికలగూర గంప రాసే టైముకి ఆసుపత్రి నుంచి ఇంటికొచ్చి పడ్డాను. రోజు, రోజుకీ పుంజుకుంటున్న నన్ను చూసి ఒకావిడ "ఇహనేం, నీ వయసు పదేళ్ళు తగ్గిపోతుంది ఇంక" అంది. "ఆ సంగతి నాకు తెలీదు కానీ, ఇన్నాళ్ళూ షెడ్డులో పెట్టిన కారులా ఉండేవాణ్ణి. ఇప్పుడు రోడ్డు మీద పరిగెడుతున్న లెక్సస్‌లా హేపీగా ఫీలవుతున్నాను" అన్నాను ఈ నాటి తెలుగు పరిభాషలో. వచ్చే పదేళ్ళలో నాకు పిల్లలు పుడితే ఆవిణ్ణి పిలిచి నా వయసు తగ్గిన మాట కన్‌ఫర్మ్ చేస్తాను. ఒఖ్ఖ బిన్ లాడెన్‌ని హతమార్చడం తప్ప ఇప్పటి దాకా ఈ 'ఖర' నామ సంవత్సరం రకరకాల దుర్వార్తలతో తనపేరు..అంటే 'అడ్డ గాడిద' వత్సరం అని పేరు సార్థకం చేసుకుంటోంది, నిలబెట్టుకుంటోంది అనిపిస్తోంది. బాపుగారు "భశుం" కార్టూన్ లాగా గడుస్తున్న ఈ ఏడు ఇలా ఎన్నాళ్ళు ఉంటుందో అని అనుమానం నన్ను వేధిస్తోంది.

(నా అనారోగ్యానికి కొవ్వూ, సుగరూ లాంటివి కారణం అయినా, నేను మళ్ళీ ఆరోగ్యవంతుణ్ణి అవ్వాలని మనసారా కోరుకున్న అనేక మంది అభిమానులూ, హ్యూస్టన్ నుంచి హృషీకేశ్ దాకా చాలా చోట్లా పూజలు చేయించిన బంధు మిత్రులూ, "పెద్దాయన" దయా నేను మళ్ళీ మామూలు మనిషిని అవడానికి కారణాలు.)

**అందరికీ "కౌముది" ద్వారా నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను."**

●●●

Click here to share your comments on this article